ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాల్లో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA
# విజ్ఞాన్ పత్రిక
తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)
APTEL/2024/89102

సంపుటి : 02 సంచిక : 68 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి బుధవారం 08 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02

# అనిశ్చితికి తెర



- నెరవేరిన ప్రజల కల
- చరిత్రలో నిలిచిపోనున్న ఏప్రిల్ 6
- అమరావతి రైతుల గౌరవానికి, వారి దీర్ఘకాల పోరాటానికి లభించిన న్యాయమని సీఎం వెల్లడి
- అమరావతి గెజిట్ నోటిఫికేషన్?పై హర్షం వ్యక్తంచేసిన డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని అమరావతి
- అమరావతి మన ఆత్మగౌరవానికి, మన భవిష్యత్తుకు ప్రతీక
- రైతుల సహనం, త్యాగం, నిబద్ధతే ఈ విజయానికి పునాది

ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి రాజముద్ర పడింది. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని కేంద్రం ప్రకటించింది. అమరావతికి చట్టబద్ధత కల్పించింది.



## 31 ప్రాజెక్టులకు ఎస్ఐపిబి ఆమోదం

- అమరావతి క్వాంటం వ్యాలీలో 3 సంస్థల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో 16వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం
- రూ.39,436 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం
- ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు

రాష్ట్రంలో రూ. 39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టుల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 16వ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం ఆమోదం తెలిపింది.



# ఇరాన్‌ను నాశనం చేస్తా

- ★ 'హోర్ముజ్'ను తెరవాల్సిందే : ట్రంప్ హెచ్చరిక
- ★ ఖర్గ్ సహా ఇరాన్ వ్యాప్తంగా దాడులు ముమ్మరం
- ★ వంతెనలు, రైల్వే మార్గాలు, ఎయిర్‌పోర్టుపై దాడులు
- ★ తాజా దాడుల్లో 18మంది మృతి
- ★ మేమూ రెఢీ : ఇరాన్
- ★ విద్యుత్ ప్లాంట్ల చుట్టూ మానవ హారాలు
- ★ రైళ్ళలో ప్రయాణిస్తే ప్రాణాలకు ముప్పు తప్పదు : ఇజ్రాయిల్
- ★ దక్షిణ లెబనాన్‌లో బలగాల మోహరింపు
- ★ రెస్క్యూ ఆపరేషన్ గురించి ఎవరు చెప్పారు?
- ★ జర్నలిస్టులను నిలదీసిన ట్రంప్..చెప్పకుంటే జైలుకేనని బెదిరింపు
- ★ రెస్క్యూ ఆపరేషన్ గురించి ఎవరు చెప్పారు?
- ★ విద్యుత్ ప్లాంట్ల చుట్టూ మానవ హారాలు
- ★ శాంతియుత పరిష్కారమే ఏకైక మార్గం
- ★ యుద్ధ నేరాలను కోర్టులే నిర్ణయిస్తాయి
- ★ డెడ్‌లైన్‌పై ట్రంప్ చర్చోపచర్చలు

టెహ్రాన్ : తమ డిమాండ్లను ఆమోదించకుండా పెడచెవిన పెట్టిన నేపథ్య ంలో ఇరాన్ నాగరికతను ఒక్క రాత్రిలో నాశనం చేస్తామని బెదిరించారు. "ఈ రాత్రికే మొత్తం నాగరికత అంతరిస్తుంది. తిరిగి దానిని ఎన్నటికీ పునరుద్ధరించలేం. అలా జరగాలని నేను కోరుకోవడం లేదు. కానీ బహుశా జరగవచ్చు." అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అంతకుమించి ఆయన వివరాలివ్వలేదు. కానీ, ఇరాన్ వంతెనలు, విద్యుత్ ప్లాంట్లు, ఇతర పౌర సదుపాయాలే ఇక తమ లక్ష్యాలుగా ఉంటాయని అమెరికా అధ్యక్షుడు ఇప్పటికే హెచ్చరించారు.

**వరుస దాడులు :** కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని లేదా హోర్ముజ్ జలసంధిని తెరవాలని లేదంటే ఇరాన్ వినాశనం తప్పదని అమెరికా అధ్యక్షుడు ఇచ్చిన గడువు ముగియడానికి కొద్దిగంటలే మిగిలివున్న వేళ మంగళవారం ఇరాన్ వ్యాప్తంగా పలు మౌలిక వసతులు, కీలక లక్ష్యాలపై దాడులు జరిగినట్లు వరుసగా వార్తలు అందుతున్నాయి. అలాగే ఇరాన్ ఇంధన నిల్వలకు అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపంలోని పలు మిలటరీ లక్ష్యాలపై కూడా అమెరికా దాడులు జరిపింది. గుర్తు తెలియని అమెరికా సీనియర్ అధికారిని ఉటంకిస్తూ మంగళవారం యాక్సిస్ వార్తా సంస్థ ఈ వివరాలు వెల్లడించింది. అలాగే టెహ్రాన్‌కు దక్షిణంగా, ఇరాన్ నగరమైన క్వామ్స్‌కు సమీపంలో గల వంతెనపై కూడా దాడులు జరిగాయని ప్రావిన్స్ డిప్యూటీ గవర్నర్ తెలిపారు.

## మహిళలకు రూ.2000

- యువతకు ఉద్యోగాలు
- బంగాల్ కాంగ్రెస్ ఎన్నికల హామీలు
- మహిళలకు పోస్ట్-గ్రాడ్యుయేషన్ స్థాయి వరకు ఉచిత విద్య
- ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను ఏడాదిలోపు భర్తీ చేస్తాం
- బంగాల్ అసెంబ్లీ వేళ మ్యానిఫెస్టోను విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ

అసెంబ్లీ ఎన్నికల వేళ బంగాల్ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ



## జల సంరక్షణకు కట్టుబడి పని చేద్దాం

- జల్ జీవన్ మిషన్ 2.0లో జల సంరక్షణకు ప్రాధాన్యం
- ప్రజల్లోనూ చైతన్యం కలిగించాలి
- 100 రోజుల స్పెషల్ డ్రైవ్ కు శ్రీకారం
- భవిష్యత్తు తరాల కోసం నీటిని కాపాడుకోవడం తప్పనిసరి
- 'గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వం' వర్క్ షాపు ప్రారంభించి, ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

జలమే జీవం... జీవమే జల సంరక్షణకు మూలం అనే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి. సాధారణ ప్రజలు ఇళ్లలో వాడే నీటిని తిరిగి భూమిలోకి పంపే చర్యలు నుంచి వాగులు, వంకలు, నదుల ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కాపాడుకునే వరకు ఈ చైతన్యం అందరిలో వెల్లివిరియాల'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. భూమి మీద మనిషికి అవసరం అయ్యే నీటి శాతం చాలా తక్కువగా ఉంది.. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు తీరని



అన్యాయం చేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వంపై ఒక రోజు వర్క్ షాపు కానూరులోని ఏపీఎస్ఐఆర్డీ భవన్ లో గురువారం ఉదయం మొదలైంది.

## అస్సాం, కేరళలో ప్రచారానికి తెర

- హోరాహోరీ పోరు
- ప్రచారం కొత్త పుంతలు
- పుదుచ్చేరిలోనూ మూగబోయిన మైకులు
- మే 4న ఓట్ల లెక్కింపు
- కేరళలో 140, అస్సాంలో 126, పుదుచ్చేరిలో 40 అసెంబ్లీ స్థానాలు



# ఇరాన్‌ను నాశనం చేస్తా

కొద్ది నిమిషాల క్రితమే క్వావ్స్ కమ్యూనికేషన్ లైన్లకు సంబంధించిన వంతెనల్లో ఒక దానిపై దాడి జరిగిందని గవర్నర్ మోర్తెజా హైదరి తెలిపారు. అలాగే ఇరాన్‌లోని అల్బొరాజ్ ప్రావిన్స్‌లో జరిగిన వైమానిక దాడుల్లో 18మంది మరణించినట్లు ప్రభుత్వ మీడియా తెలిపింది. ఖొరామాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా కూడా దాడులు జరిగాయని ప్రభుత్వ వార్తా సంస్థ తెలిపింది. మరిన్ని వివరాలు అందాల్సి వుందని పేర్కొంది. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమంతో సంబంధమున్న మిలటరీ స్థావరమైన పర్చిన్‌కు సమీపంలోని ప్రాంతాలపై, టెహ్రాన్‌కు నట్టనడిబొడ్డున గల కొన్ని పాయింట్లపై దాడులు జరిగాయి. క్రూయిజ్ క్షిపణి ఒక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న వీడియో ఒకటి బాగా వైరల్ అయింది. టెహ్రాన్‌లోని యూదు ప్రార్థనా మందిరం ఒకటి ఈ దాడుల్లో పూర్తిగా ధ్వంసమైందని ఇరాన్ మెహర్ వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్‌పై వరుసగా వైమానిక దాడులతో దండెత్తామని ఇజ్రాయిల్ మిలటరీ ప్రకటించింది. అంతర్జాతీయ మధ్యవర్తుల నుంచి కాల్పుల విరమణకు ఎలాంటి ప్రతిపాదన అందలేదని ట్రంప్ ప్రకటించిన వెంటనే ఈ దాడులు ముమ్మరమయ్యాయి. కొద్దిసేపటి క్రితమే ఐడీఎఫ్ దాడులను ముగించిందని, టెహ్రాన్‌లోని తీవ్రవాద మౌలిక వసతులను నాశనం చేశామని ఇజ్రాయిల్ మిలటరీ తన అధికారిక టెలిగ్రామ్ చానెల్‌లో పేర్కొంది. ఇరాన్ వ్యాప్తంగా డజన్ల సంఖ్యలో మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని విస్తారంగా దాడులు పూర్తి చేసినట్టు తెలిపింది. అయితే ఏ ఏ స్థావరాలు, ఇతరత్రా వివరాలను వెల్లడించలేదు. ఈ దాడులతో మరోసారి ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. రికార్డు స్థాయిలో బారెల్ ధర 116 డాలర్లకు చేరింది. ఇరాన్ యుద్ధం అమెరికా అగ్ర నాయకత్వాన్ని స్తంభింపజేసిందని ఇటలీ రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు. కాగా యుద్ధాన్ని నిలుపు చేసేందుకు పాకిస్తాన్ చేస్తున్న సానుకూల ప్రయత్నాలు, కీలకమైన దశకు చేరుకున్నాయని పాకిస్తాన్‌లో ఇరాన్ రాయబారి రెజా అమిరి మొఘాదమ్ వ్యాఖ్యానించారు.

**రైళ్లలో ప్రయాణిస్తే ప్రాణాలకు ముప్పు తప్పదు : ఇజ్రాయిల్**

ఇరాన్ కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 9గంటల వరకు రైళ్ళలో ప్రయాణాలు చేయవద్దని ఇరాన్ ప్రజలను ఇజ్రాయిల్ మిలటరీ హెచ్చరించింది. రైళ్ళకు, రైల్వే లైన్లకు సమీపంలో ఉన్నట్లైతే ప్రాణాలకు ముప్పు తప్పదని స్పష్టం చేసింది. అయితే ఏ ఏ ప్రాంతాల్లోని రైల్వే మార్గాలు తమ లక్ష్యాలనే వివరాలు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఇరాన్ కూడా అప్రమత్తమైంది. దేశంలోని మాసాద్ ఏరియా వ్యాప్తంగా రైళ్ళ రాకపోకలు నిలిచిపోయాయి.

**దక్షిణ లెబనాన్‌లో బలగాల మోహరింపు** : దక్షిణ లెబనాన్‌లో డిఫెన్స్ లైన్ పొడవునా తమ బలగాల మోహరింపు పూర్తయిందని ఇజ్రాయిల్ మిలటరీ మంగళవారం ప్రకటించింది. అయితే ఎక్కడ, ఎంతమంది అనే వివరాలు ఇవ్వలేదు. లెబనాన్ భూభాగంలోకి చొచ్చుకువెళ్ళేలా ఎంత దగ్గరలో బలగాలను మోహరించిందనే సమాచారం స్పష్టంగా ఇవ్వలేదు. ఈ దశలో ఐడీఎఫ్ సైనికులు తమ యుద్ధ ట్యాంక్ విధ్వంసక క్షిపణి వ్యవస్థలతో సర్వం మోహరించి వున్నారని మిలటరీ ప్రకటన పేర్కొంది.

**రెస్క్యూ ఆపరేషన్ గురించి ఎవరు చెప్పారు? : జర్నలిస్టులను నిలదీసిన ట్రంప్..చెప్పకుంటే జైలుకేనని బెదిరింపు**

యుద్ధంలో ఆచూకీ తెలియకుండా పోయిన పైలట్ కోసం జరిపిన రెస్క్యూ ఆపరేషన్‌ను తమ ప్రభుత్వంలోని వారే లీక్ చేశారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. అతనో 'మచ్చ' లాంటి వాడని, అతనిని కనిపెట్టేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని చెప్పారు. ఇరాన్‌లో చిక్కుబడిపోయిన పైలట్ కోసం అమెరికా జరిపిన రెస్క్యూ ఆపరేషన్ గురించి ఆయన సోమవారం విలేకరులతో ముచ్చటించారు. ఆచూకీ తెలియకుండా పోయిన వైమానిక దళ అధికారి కోసం జరిపిన గాలింపు చర్యల గురించి ముందుగా వార్తను అందించిన పాత్రికేయుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమాచారాన్ని ఇచ్చిన

**రెస్క్యూ ఆపరేషన్ గురించి ఎవరు చెప్పారు? :** వారి పేరును బయటపెట్టని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. 'గాలింపు చర్యల గురించి సమాచారం ఇచ్చిన వారి పేరు చెప్పండి. లేకుంటే జైలు తప్పదు. అది కూడా త్వరలోనే' అని అన్నారు. అయితే జర్నలిస్టు పేరు కానీ, వార్తను అందించిన మీడియా సంస్థ పేరును కానీ ఆయన చెప్పలేదు. కాగా ఘటనపై న్యూయార్క్ టైమ్స్, ఫ్యాక్స్ న్యూస్, ఆక్సియాన్‌లు ముందుగా వార్తలు ఇచ్చాయి. కీలక సమాచారంపై ఉప్పందడంతో ఇరాన్ దళాలు అప్రమత్త మయ్యాయని ట్రంప్ వాపోయారు.

**ఐఆర్‌జీసీ హెచ్చరిక :** అమెరికా గనుక లక్ష్మణ రేఖను ఉల్లంఘిస్తే ప్రతిస్పందన పశ్చిమాసియా ప్రాంతాలను దాటి ఉంటుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) మంగళవారం పొరుగు దేశాలను హెచ్చరించింది. తమ సహనం కూడా నశించిందని, అమెరికా, ఇజ్రాయిల్ సహా వాటి మిత్రదేశాలపై దాడులు చేస్తామని ప్రకటించింది.

**విద్యుత్ ప్లాంట్ల చుట్టూ మానవ హారాలు :** విద్యుత్ ప్లాట్లు, వంతెనలు సహా మౌలిక వసతులే తమ దాడులకు లక్ష్యాలుగా ఉంటాయని ట్రంప్ బెదిరించిన నేపథ్యంలో విద్యుత్ ప్లాంట్లను కాపాడుకునేందుకు దానిచుట్టూ మానవ హారాలు నిర్మించాల్సిందిగా ఇరాన్, యువతను కోరింది.

## అస్సాం, కేరళలో ప్రచారానికి తెర

కేరళ, అస్సాం అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మంగళవారం సాయంత్రంతో తెర పడింది. వాటితో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోనూ మైకులు మూగబోయాయి. మూడు అసెంబ్లీలకూ గురువారం ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ చేసింది. మే 4న ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలను వెల్లడించనుంది. కేరళలో 140, అస్సాంలో 126, పుదుచ్చేరిలో 40 అసెంబ్లీ స్థానాలున్నాయి. మంగళవారం చివరి రోజు కేరళ, పుదుచ్చేరి, అస్సాంలో ప్రధాన పార్టీలన్నీ ముమ్మర ప్రచారంతో హోరెత్తించాయి. సభలు, రోడ్ షోలు, ర్యాలీలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు చివరి నిమిషందాకా ప్రయత్నించాయి. కేరళలోనైతే కొన్ని చోట్ల అభ్యర్థులు క్రేన్లపైకి ఎక్కి మరీ ప్రసంగాలు చేశారు!

**హోరాహోరీ పోరు :** కేరళలో మూడు కూటములు బరిలో ఉన్నా పోరు ప్రధానంగా సీపీఎం సారథ్యంలోని అధికార ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష యూడీఎఫ్ కూటముల మధ్యే కేంద్రీకృతమైంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఈసారి రాష్ట్రంలో ఎలాగైనా గట్టిగా ఉనికి చాటుకోవాలని పట్టుదలగా ఉంది. నెల రోజులపాటు పార్టీలన్నీ ముమ్మరంగా ప్రచారం చేశాయి. ఎన్డీఏ తరఫున ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పలుమార్లు రాష్ట్రంలో పర్యటించగా కాంగ్రెస్ నుంచి రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా స్టార్ ప్రచారకులుగా నిలిచారు. ఎల్డీఎఫ్ కూటమి ప్రచారం ప్రధానంగా సీఎం విజయన్‌పైనే ఆధారపడి సాగింది. యువ ఓటర్లను ఆకట్టుకునేందుకు పార్టీలన్నీ ఈసారి ప్రాధాన్యమివ్వడం విశేషం. అస్సాంలో ఈసారి కూడా నెగ్గి హ్యాట్రిక్ కొట్టాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. దాన్ని ఎలాగైనా అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఎప్పట్లాగే అవి రెండూ పలు ప్రాంతీయ పార్టీలతో జట్టు కట్టి బరిలో దిగాయి. బీజేపీ తరఫున మోదీ, అమిత్ షా, కాంగ్రెస్ నుంచి రాహుల్, పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే విస్తృతంగా ప్రచారం చేశారు. మోదీ, అమిత్ షా పుదుచ్చేరిలో కూడా ప్రచారంలో పాల్గొన్నారు. పుదుచ్చేరిలో ఎన్నికలు పాలక ఎన్డీఏ, విపక్ష ఇండియా కూటములకు ప్రతిష్టాత్మకంగా పరిణమించాయి.

# అనిశ్చితికి తెర

ఈమేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తర్వాత కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

రాజధాని కలను సాకారం చేస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ చట్టంకు ఆమోదం తెలిపిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు రాష్ట్ర ప్రజల తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై అంకితభావంతో, దృఢ సంకల్పంతో ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోదీకి, బిల్లుకు మద్దతు తెలిపిన పార్లమెంట్ సభ్యులకు, రాష్ట్ర నాయకులకు, కలిసి నిలిచిన ప్రతి ఆంధ్రప్రదేశ్ పౌరుడికి ధన్యవాదాలు చెప్పారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయమని స్పష్టం చేశారు. ముఖ్యంగా అమరావతి రైతుల గౌరవానికి, వారి దీర్ఘకాల పోరాటానికి లభించిన న్యాయమని వెల్లడించారు.

ఇకనుంచి రాష్ట్రానికి రాజధాని అమరావతి: రాజధాని అమరావతి గెజిట్ విడుదలపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇక రాజధాని లేని రాష్ట్రం కాదన్నారు. అనిశ్చితికి తెర పడిందన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఏప్రిల్ 6వ తేది గొప్పరోజుగా నిలిచిపోతుందని పవన్ అన్నారు. పార్లమెంటులో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం తర్వాత కేంద్రం గెజిట్ విడుదల చేయడంతో రాష్ట్ర ప్రజల కోరిక తీరిందన్నారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులు, అమరావతికి అండగా నిలబడిన ప్రజలకు పవన్ శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్ర విభజన జరిగిన 12 ఏళ్ల తర్వాత, ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని భారత ప్రభుత్వం అధికారికంగా గుర్తించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమరావతిని ప్రజా రాజధానిగా అభివృద్ధి చేయడంలో అందరం కలిసి ముందుకు సాగుదామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేసేలా, స్వర్ణాంధ్ర – 2047 లక్ష్యంతో రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దామన్నారు.

రైతుల సహనం, త్యాగం, నిబద్ధతే ఈ విజయానికి పునాది: అమరావతికి చట్టబద్ధత ప్రతి ఆంధ్రప్రదేశ్ పౌరుడికి చారిత్రాత్మక రోజని మంత్రి లోకేశ్? హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ చట్టం, 2026కు ఆమోదం తెలపడంతో, మన రాజధాని కల అధికారికంగా సాకారమైందని వెల్లడించారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అండగా నిలిచిన ప్రధాని మోదీకి కోట్లాది తెలుగు ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీల ఎంపీలకు ధన్యవాదాలు చెప్పారు. అమరావతి రైతులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపిన లోకేశ్? వారి సహనం, త్యాగం, నిబద్ధతే ఈ విజయానికి పునాదని అభివర్ణించారు. అందరం కలిసి సాధించిన గొప్ప విజయమిదని కొనియాడారు.

అమరావతి మన ఆత్మగౌరవానికి, మన భవిష్యత్తుకు ప్రతీక: అమరావతికి రాజముద్ర పడటంపై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేయడం, కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం అత్యంత సంతోషకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ ఇది చరిత్రాత్మక సందర్భం అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఏకైక రాజధానిగా అమరావతికి అధికారిక వేయడం రైతుల త్యాగానికి, ప్రజల ఆశలకు, భవిష్యత్తు తరాల కలలకు లభించిన న్యాయంగా అభివర్ణించారు. అమరావతి ఇప్పుడు కేవలం ఒక నగరం కాదు, మన ఆత్మగౌరవం, భవిష్యత్తుకు ప్రతీక అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయడంలో సహకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి బాలకృష్ణధన్యవాదాలు చెప్పారు. బిల్లుకు మద్దతిచ్చిన పార్టీలు, పార్లమెంట్ సభ్యులు, వెన్నంటి నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి అజేయంగా, అజరామరంగా వెలుగొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. అందరం కలిసి అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుదామని బాలయ్య పిలుపునిచ్చారు.

# 31 ప్రాజెక్టులకు ఎస్ఐపిబి ఆమోదం

ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. అమరావతి క్వాంటం వ్యాలీలో 3 సంస్థల ఏర్పాటుకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్? ఇచ్చింది. సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా రాయలసీమను తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ట్రాన్స్‌మిషన్ లైన్స్ ఉండాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 325 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఉత్పత్తి అయిన విద్యుత్?ను స్టేట్? గ్రిడ్, సెంట్రల్ గ్రిడ్?కు కనెక్ట్? చేసేలా చూడాలని మంత్రి లోకేశ్? సూచించారు. ప్రస్తుతం రాజస్థాన్?లో సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నా పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి ఉందని, అలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో కంజ్యూమర్ ప్రొడక్ట్స్ తయారీలో ఏపీ కీలకంగా మారాలని ముఖ్యమంత్రి సూచించారు. శ్రీసిటీ, కొప్పర్తి, అనంతపురంలలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా పెట్టుబడుల్ని ఆకర్షించాలన్నారు. రాష్ట్రంలో జీసీసీల ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. ఏపీ జీసీసీలకు కేంద్రంగా మారాలన్నారు. వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా కల్చర్ రంగాల్లో వస్తున్న వ్యర్ధాలను సద్వినియోగం చేసుకునేలా ప్రాజెక్టులను ఆహ్వానించాలని స్పష్టం చేశారు. ఈ రంగాల్లో కాలుష్య కారకాలు లేకుండా ఇథనాల్ తరహా బై ప్రొడెక్టులు వచ్చేలా చూడాలని దీనికి సంబంధించిన అంశాలపై అధ్యయనం చేయాలన్నారు. దీనిపై కేంద్రం నుంచి సహకారం కూడా తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో వివిధ పెట్టుబడి ప్రతిపాదనలతో వస్తున్న పరిశ్రమల్లో ఆధునిక భద్రతా ప్రమాణాలను ఏర్పాటు చేసుకోవటంపై కూడా దృష్టి సారించాలని చంద్రబాబు సూచించారు.

ప్రమాణాలను పాటించే విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు: భవిష్యత్తులో ఉత్పన్నమయ్యే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా ఈ సేఫ్టీ స్టాండర్డ్స్?ను నిర్దేశించాలన్నారు. ఫార్మా, స్టీల్, గ్రీన్ ఎనర్జీ, బీఈఎస్ లాంటి ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేకంగా ఓ ఎస్ఓపీని సిద్ధం చేయాలని సూచించారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ నిబంధనలకు అనుగుణంగా ఈ భద్రతా ప్రమాణాలను పారిశ్రామిక యూనిట్లు కలిగి ఉండాలని తేల్చి చెప్పారు. ఇటీవల రాష్ట్రంలోని బాణసంచా తయారీ యూనిట్లలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బాణసంచా తయారీ యూనిట్లు, మిల్క్ డెయిరీలు లాంటి అంశాల్లో ఉల్లంఘనలు లేకుండా ప్రామాణిక విధానాలు జారీ చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రమాణాలను పాటించే విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అమరావతి క్వాంటం టవర్స్ ను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. భూములు కేటాయించిన పర్యాటక ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని ఈ విషయంలో ఎలాంటి మినహాయింపు లేదన్నారు.

## కంటి చూపు సరిగా లేనివారికి ఉచితంగా కళ్ళద్దాలు పంపిణీ చేసిన మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

**-జయప్రద ఫౌండేషన్ చైర్మన్ టీడీ జనార్ధన్ ఆధ్వర్యంలో ఉచితంగా కళ్ళద్దాల పంపిణీ**

**కృష్ణా / పెనుగ్రంచిపోలు, ఏప్రిల్ 07** పెనుగ్రంచిపోలు మండలం లింగగూడెంలో కంటి చూపు సరిగా లేని 130 మందికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మంగళవారం కళ్ళద్దాలు పంపిణీ చేశారు. జయప్రద ఫౌండేషన్ చైర్మన్ టీడీ జనార్ధన్ ఆధ్వర్యంలో ఉచితంగా మంత్రి కళ్ళద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.... అన్న ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో టీడీ జనార్ధన్ సొంత ప్రాంతంలో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం. జయప్రద ఫౌండేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా మెడికల్ క్యాంపులు, ,కంటి చూపు సరిగా లేని వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు , విద్యార్థులకు స్కాలర్షిప్పులు అందిస్తున్నారు. మహిళల్లో కాన్సర్ ని గుర్తించేందుకు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా ఉ



ండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

# జల సంరక్షణకు కట్టుబడి పని చేద్దాం

ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. అనంతరం కళ్యాణ్ ప్రసంగిస్తూ "నీరు ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి బాగుంటుంది. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవన విధానం మెరుగవడానికి గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార వంటి నదులే జీవనాధారం. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా దేశంలో ముందు వరుసలో ఉండటానికి మనకు సమృద్ధిగా ఉన్న నీటి వనరులే కారణం. అలాంటి నీటిని సంరక్షించుకునే పెద్ద సవాల్ ఇప్పుడు మన ముందుంది. ఉపరితల జలాలను జాగ్రత్తగా కాపాడుకోవడం, రానురాను తగ్గుతున్న భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. భవిష్యత్తును సుందరంగా నిర్మించుకోవాలంటే ప్రతి నీటి చుక్క ఎంత విలువైందో తెలుసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే నీటి సంరక్షణ చర్యలు, వృథా అయ్యే నీటిని కాపాడుకునే చర్యలను వేగవంతం చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు మనం భరోసానిచ్చినట్లు అవుతుంది. గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు ఎన్నో అవరోధాలు ప్రతి కుటుంబానికీ తగినంత తాగు నీరు అందించాలనే ఆశయానికి క్షేత్రస్థాయిలో ఎన్నో అవరోధాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తగినంతగా – ఉపరితలంలో లభించే నీరు లభ్యత లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం కీలకమైన సమస్యలుగా ఉన్నాయి. లభ్యతగా ఉన్న నీరు కూడా ఎక్కువగా కాలుష్యం బారిన పడుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరి శిఖర గ్రామాల్లో వేసవిలో నీటి సమస్యను తీర్చేందుకు వాటర్ షెడ్ల పునరుద్ధరణకు ప్రణాళికలు వేస్తున్నాం. మారుతున్న సాంకేతికను ఎప్పటికప్పుడు వినియోగించుకొని నీటి కొరత తీర్చేందుకు, నీటి సంరక్షణ చర్యలు చేపట్టేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నాం. ముఖ్యంగా నీటి సంరక్షణ చర్యల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం. నీటి సంరక్షణకు ప్రాధాన్యం ప్రతి కుటుంబానికి తగినంత తాగునీరు అందించాలనే బృహత్ సంకల్పంతో జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా ముందుకు వెళ్తాం. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి మార్గదర్శకంలో నీటి పొదుపు చర్యలు తీసుకుంటాం. జల్ జీవన్ మిషన్ 2.0 కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. నీటిని జాగ్రత్తగా వినియోగించుకునేలా, వృథా నీటిని పునర్వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన తీసుకురావడం ప్రధానం. 100 రోజుల ప్రణాళికకు శ్రీకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "100 రోజుల నీటి వినియోగ డ్రైవ్" అనే కార్యక్రమాన్ని ఈ ఏప్రిల్ 6వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు చేపట్టింది. దీనిలో ప్రజల్లో చైతన్యం కలిగించి భూగర్భ జలాల పెంపుదల, నీటి వృథాను అడ్డుకోవడం, నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవడం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం వంటి చర్యలను తీసుకుంది. ప్రకృతిలో మన జీవనం.. జీవితం ముడిపడి ఉందనేది భారతీయ సంస్కృతికి మూలం. ప్రకృతిని కాపాడుకుంటే, ప్రకృతి మనకు మంచి చేస్తుంది. జీవితాన్ని, ప్రకృతిని సమతుల్యం చేసుకుంటేనే భవిష్యత్తు అనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రకృతి ఇచ్చిన నీటి వనరులను ఉపయోగించుకోవడంలో జాగ్రత్త వహించాలి" అన్నారు. ఈ వర్క్ షాపులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కాలుష్య నియంత్రణమండలి ఛైర్మన్ డా.పి కృష్ణయ్య ఏపీ ఎస్ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 12 వ తేదీన బండ్ల పల్లిలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి.

-వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.హెచ్.ప్రభాకర్.



**గూడూరు విశాలాంధ్ర.** ఈనెల 12 వ తేదీన అనంతపురం జిల్లా బండ్ల పల్లి లో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. హెచ్.ప్రభాకర్ పేర్కొన్నారు.మంగళవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తో ఇప్పటికే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నారు అన్నారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు నే కొనసాగించాలన్నారు. జి రామ్.జి .చట్టాన్ని రద్దు చేయాలన్నారు.గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు కేటాయిస్తుండగా, 10 శాతం నిధులు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరించేదన్నారు.నేడు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరించాల్సి ఉన్నందున, అనేక రాష్ట్రప్రభుత్వాలు చేతులెత్తేసే ప్రమాదమున్నది అన్నారు.కేంద్ర ప్రభుత్వం ఇకనైనా ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఈనెల 10 వ తేదీనుండి 12 వ తేదీ వరకు అనంతపురం నుండి బండ్లపల్లి వరకు జరిగే పాదయాత్రలో , బహిరంగ సభలో ప్రతి ఒక్కరు పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్ , అరుణతేజ, శేషాద్రి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఆకస్మితంగా తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్



**కనిగిరి (విజ్ఞాన రిపోర్టర్) ఏప్రిల్ 07** కనిగిరి శాసనసభ్యులు మరియు ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఉగ్ర గారి ఆదేశాలతో కనిగిరి 16 వ వార్డులో నిర్మాణంలో ఉన్న పలు సైడ్ కాలువలను, మరియు నిర్మించదలచిన పలు వీధులలోని సైడ్ కాలువల ప్లేసు ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కనిగిరి మున్సిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ సార్ వార్డులోని పలు వీధులలోని ప్రజలు డ్రైనేజీ లేని కారణంగా వారు పడుతున్న యాతనను కమీషనర్ కి చూపిస్తూ వివరించినారు ,ఈ సందర్భంగా వార్డులోని టిడిపి నాయకులు కమీషనర్ దృష్టికి తెచ్చిన పలు అంశాలను అధికారులతో చర్చించి స్పాట్లోనే సానుకూలంగా స్పందించినారు, రెండు రోజుల వ్యవధిలో చేయవలసిన పనులకు ఎస్టిమేషన్ లు రెడీ చేయవలసిందిగా వారి సిబ్బందిని ఆదేశించినారు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ వేగంగా విస్తరిస్తున్న 16 వ వార్డు ప్రత్యేకతను పలు సార్లు కమీషనర్ దృష్టికి తీసుకెళ్లినారు, కార్యక్రమంలో పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి నాగ 16వ వార్డ్ బూతు ఇంచార్జ్ చరంచెర్ల రాంబాబు మరియు వార్డ్ అధ్యక్షులు వెన్నా శ్రీనివాసులు రెడ్డి పాల్గొనినారు.

## ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ విజయవంతానికి చర్యలు : నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

-ప్రతి ఒక్కరుఎల్ఆర్ఎస్ ను సిరియస్ గా తీసుకోవాలన్న చైర్మన్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు

-మంత్రి నారాయణ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్లతో సమావేశమైన కోటంరెడ్డి



ల్యాండ్ రెగలైజేషన్ స్క్రీం ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. అక్రమ లేఅవుట్లు, అనధికారిక భూములను చట్టబద్ధం చేయడానికి ఇదో మంచి అవకాశం అన్నారు.. నెల్లూరు కందుకూరు ఆత్మకూరు కావలి మున్సిపల్ కమిషనర్లతో కూడా కార్యాలయంలో ఆయన ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. వైస్ చైర్మన్ మొగలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ మాట్లాడారు.. ఎల్ఆర్ఎస్ పై అవగాహన కల్పించేందుకు, దాన్ని విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయాలన్నారు.. వార్డ్ ప్లానింగ్ అధికారులు కొత్తగా ఉండడంతో కొంతమేర జాప్యం జరుగుతోందని తన దృష్టికీ వచ్చిందని.. మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు కమిషనర్లతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేస్తామని .. ఎల్ఆర్ఎస్ ను విజయవంతంగా నిర్వహించాలని కోటంరెడ్డి అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ కష్టపడితేనే ఈ పథకాన్ని విజయవంతం చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్లతో పాటు నూడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మమూరు కాలువలోకి దూసుకెళ్లిన ఇసుక టిప్పర్

-నియంత్రణ కోల్పోయి వంతెనపై నుంచి బోల్తా..!

-డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



**చేబ్రోలు** గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామ శివారులో ఘోర ప్రమాదం తప్పింది. వేగంగా వెళ్తున్న ఓ ఇసుక టిప్పర్ నియంత్రణ కోల్పోయి కొమ్మమూరు కాలువ వంతెన పైనుంచి కాలువలోకి బోల్తా పడింది. ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక సమాచారం ప్రకారం.. ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్ చేబ్రోలు శివారులోని కొమ్మమూరు కెనాల్ వంతెనపైకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పింది. వంతెన రక్షణ గోడను బలంగా ఢీకొట్టి, నేరుగా కాలువలోకి పడిపోయింది. ప్రమాద ధాటికి వాహనం ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను గమనించిన అటుగా వెళుతున్న వాహనదారులు, స్థానికులు వెంటనే స్పందించి బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న డ్రైవర్‌ను 108 అంబులెన్స్ ద్వారా మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి (++ఎ) తరలించారు. సమాచారం అందుకున్న చేబ్రోలు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాలువలో పడిపోయిన టిప్పర్‌ను వెలికితీసేందుకు చర్యలు చేపట్టారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 'కమ్మని పాలనలో ఇబ్బందులు.. రాజీనామా చేస్తా'

- ఆదినారాయణరెడ్డి సంచలనం



ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ) నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సొంత ప్రభుత్వంపైనే తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ప్రజలకు మేలు చేయలేనప్పుడు ఈ పదవి ఎందుకని ప్రశ్నిస్తూ, అవసరమైతే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

**ప్రభుత్వ తీరుపై తీవ్ర అసహనం :** తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆదినారాయణరెడ్డి, కూటమి ప్రభుత్వ పనితీరుపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదని ఆయన ఆరోపించారు. గండికోట నిర్వాసితులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇతర శాఖల్లోనూ ఫైళ్లు ముందుకు కదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు."నేను ఇప్పటికే నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాను, నాకు పదవులు ముఖ్యం కాదు. ప్రజలకు న్యాయం చేయలేనప్పుడు ఈ పదవిలో కొనసాగడం అనవసరం" అని స్పష్టం చేశారు.

**రాజీనామా అస్త్రం.. 'కమ్మని' పాలనపై చర్చ :** గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమక్షంలోనే రాష్ట్రంలో "కమ్మని పాలన" సాగుతోందని వ్యాఖ్యానించి టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహం కలిగించిన ఆదినారాయణరెడ్డి, ఇప్పుడు నేరుగా రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించారు. కూటమిలో తనను ఇబ్బంది పెడుతున్నారని, అందుకే పార్టీలోనే ఉంటూ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**కూటమిలో చర్చనీయాంశంగా ఎమ్మెల్యే వ్యాఖ్యలు :** ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలతో కూటమి ప్రభుత్వంలోని అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా కీలకమైన ప్రాజెక్టుల నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్న ఆరోపణలకు ఈ వ్యాఖ్యలు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఈ పరిణామాలపై కూటమి అగ్రనాయకత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## సముద్ర తీరంలో జెట్టి నిర్మాణానికి శ్రీకారం



**కందుకూరు ( విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 07** కందుకూరు నియోజకవర్గం కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ విభాగం పనితీరు సరిగాలేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య సిబ్బందిపై పర్యవేక్షణ కూడా సరిగా లేదన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి ఆకస్మికంగా వెళ్లిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు... కమిషనర్ అనూషతోపాటు శానిటేషన్ సూపర్వైజర్లు, మేస్త్రిలతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం సరిగాలేదంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొన్నిచోట్ల రోజుల తరబడి కాలువల్లో చెత్తను క్లియర్ చేయడం లేదని, మరికొన్నిచోట్ల తూతూమంత్రంగా పనిచేస్తుండడం వల్ల దుర్వాసన వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడెక్కడ అలాంటి పరిస్థితి ఉందో, వార్డుల వారీగా ఆయన వివరించారు. కమిషనర్ ఒక్కరే సక్రమంగా పనిచేస్తే సరిపోదని, సిబ్బంది మొత్తం బాధ్యతతో పనిచేసినప్పుడే శుభ్రమైన వాతావరణం ఏర్పడి ప్రజల హర్షిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా చెత్త పేరుకుపోయే బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. దుకాణదారులు, తోపుడుబండ్ల వ్యాపారులు రాత్రిపూట చెత్తను రోడ్లు, సైడ్ కాలవల్లో ఇష్టానుసారంగా వేస్తున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాంటివారికి పారిశుధ్యంపై ఎందుకు అవగాహన కల్పించడం లేదని కమిషనర్ ను ప్రశ్నించారు. వారందరికీ అవగాహన కల్పించాలని, అప్పటికి మార్పు రాకపోతే జరిమానాలు విధించాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే పారిశుధ్య సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే, వారిని వెంటనే తొలగించాలని కూడా ఎమ్మెల్యే ఆదేశించారు. మరో వారం రోజుల్లో మున్సిపాలిటీలో పరిస్థితి చక్కబడాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అధికారులతో అన్నారు. వారం తర్వాత ప్రతిరోజూ ఉదయాన్నే తాను కూడా స్వయంగా వార్డుల్లో పర్యటనకు వస్తానని చెప్పారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాధాకృష్ణ క్షమాపణ చెప్పాలి : దద్దాల



**కనిగిరి (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 07** ఆంధ్రజ్యోతి లో కొత్తపలుకు పేరుతో ఏబీఎన్ రాధాకృష్ణ అత్యంత దిగజారి వైఎస్సార్సీపీ నేతలు, నాయకుల కుటుంబ సభ్యులు వారి భార్యలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా,బాధాకరం ఉన్నాయని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పేర్కొన్నారు మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయం నుండి మాట్లాడుతూ ఏబీఎన్ రాధాకృష్ణ మహిళలపై దిగజారి వ్యాఖ్యలు చేయించడం దుర్మార్గమన్నారు. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్లాన్-బి గా మావిగన్(మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు ) 110 కి.మీ కారిడార్ ను రాజధాని ప్రాంతగా ప్రకటించాలని ప్రతిపాదించిన తరువాత కూటమి నేతల అవినీతి కోటలు బద్దలవుతున్నాయని చెప్పారు.ఆ భయంతోనే ఎల్లో మీడియా నీచంగా వ్యక్తిత్వ హననానికి దిగుతోందని మండిపడ్డారు. రాష్ట్ర రాజధానిపై ప్లాన్-బీగా జగన్ ప్రతిపాదించిన మావిగన్ పై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత చర్చ జరుగుతోందని, ఇది చూసి ఓర్వలేక ప్రజల దృష్టి మళ్లించాలని కోట్లాది రూపాయిలు ఖర్చు చేసి సోషల్ మీడియా లో నెగటివ్ ట్రోలింగ్ చేయిస్తున్నారన్నారు.మహిళల గురించి ఏ బి ఎన్ రాధాకృష్ణ తప్పుగా మాట్లాడాడు. అతని మాటల్ని ఖండించాల్సింది పోయి సీఎం చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ ట్వీట్స్‌తో వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందని మహిళలంటే కూటమి నేతలకు ఎంత గౌరవవెూ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు అర్థమైందన్నారు.మహిళల ఆత్మ గౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదని,జర్నలిజం ముసుగులో ఇలాంటి అక్షర వ్యభిచారం చేయొద్దు అని కోరారు.ఏబీఎన్ రాధాకృష్ణ ఇకనైనా బుద్ది తెచ్చుకోవాలని, మహిళలపై తప్పుడు రాతలు రాసినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలని దద్దాల నారాయణ యాదవ్ డిమాండ్ చేశారు.

## చక్కని మార్గం

జీవితం అంటే కేవలం
ధనం, పేరు, హోదా కాదు
చాలా చాలా ఉంటాయ్
వాస్తవానికి నిన్ను
గొప్ప వాడిని చేసేది
నీ నిజాయితీ
నీ వినయం
నీ దయ
నీ జాలి
నీ కరుణ
ఇవే నిన్ను గొప్ప స్థాయికి
తీసుకొని వెళ్తాయి
సమాజంలో నిన్ను
తల ఎత్తుకొని బ్రతికేలా చేస్తాయి
ఇవే మనకు చరిత్ర చెప్పే
నగ్న సత్యాలని గ్రహించు
కొందరు ఇష్టపడతారు
కొందరు ద్వేషిస్తారు
ద్వేషించే వారిని క్షమించండి
ఇష్టపడే వారిని ప్రేమించండి
జీవితంలో ఇలాంటివి సహజం
మనిషి ప్రశాంతమైన జీవితానికి
ఇదో చక్కనైన మార్గం!



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

## అన్నదానం ఒక పవిత్ర సమర్పణ

- సిఆర్పిఎఫ్ సబ్ ఇన్స్పెక్టర్ మందడపు ఏసోబు



**పెదకూరపాడు,ఏప్రిల్ 7** అన్నదానం ఒక పవిత్ర సమర్పణ అని,మిగిలిన ఆహారాన్ని వృధా కాకుండా చూడడం అందరి బాధ్యతని జమ్మూ కాశ్మీర్ కిస్తివాడ సిఆర్పిఎఫ్ సబ్ ఇన్స్పెక్టర్ మందడపు ఏసోబు అన్నారు. పెదకూరపాడులో జరిగిన రెండు ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని సోమవారం జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు తెలపడంతో వారు ఆ ఆహారాన్ని సేకరించి మండలంలోని 75 తాళ్లూరు బుడిగి జంగాల కాలని, పెదకూరపాడులోని వలస కూలీలకు భోజనాన్ని పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఎస్సై ఏసోబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవాభావాన్ని కలిగి ఉండాలన్నారు.జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ ఫంక్షన్ ఏదైనా భోజనాలు మిగిలి ఉంటే సమాచారం ఇవ్వండని ఆభోజనాలను సేకరించి ఎక్కడైతే పేదవారు ఉంటారు వారికి ఆహారాన్ని పంపిణీ చేస్తామన్నారు. ఆకలితో ఉన్నవారి కడుపులోకి వెళ్ళే ఒక్కొక్క మెతుకు వారికి ప్రాణాన్ని పోసి వారిలో ప్రాణశక్తిని నింపేదన్నారు.ఈకార్యక్రమంలో జన చైతన్య సమితి ప్రతినిధులు దాసరి విజయ్ బెన్నిబాబు,నాదెండ్ల అప్పారావు,గుడిపూడి బ్రహ్మనాయుడు తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 8 లక్షల రూపాయలు అందజేత..!

**వింజమూరు ఏప్రిల్ 7** వింజమూరు మండలం నడిమూరుకు చెందిన యత్తుపు భాస్కర్ రెడ్డి అనారోగ్య సమస్యతో బాధ పడుతూ, అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పరిస్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో భారీగా పెరుగుతున్న వైద్య ఖర్చులను భరించలేని పరిస్థితిలో యత్తుపు భాస్కర్ రెడ్డి గారి కుటుంబ సభ్యులు గౌరవ ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ గారిని సహాయం కోరగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం పొందేందుకు దరఖాస్తు చేసుకోవలసిందిగా సూచించారు. అనంతరం సంబంధిత అధికారులతో చర్చించి సహాయ నిధి మంజూరు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపించారు. దీంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 8 లక్షల రూపాయలను ముందస్తు వైద్య ఖర్చుల కోసం మంజూరు చేయించడం జరిగింది. ఈ ఆర్థిక సహాయం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు వారి చేతుల మీదుగా హామీ పత్రమును అందించి, అవసరమైన వైద్య చికిత్సను వెంటనే ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా యత్తుపు భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి సమయోచిత స్పందన వల్ల తమకు ఎంతో ఊరట లభించిందని పేర్కొన్నారు.



# మున్సిపాలిటీలో పారిశుధ్యంపై ఎమ్మెల్యే ఇంటూరి అసంతృప్తి

**-పర్యవేక్షణ సరిగాలేదని అధికారులపై ఆగ్రహం**
**- మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ పై సమీక్ష చేసిన ఎమ్మెల్యే**
**-ఇకనుంచి ఉదయాన్నే వార్డుల్లో పర్యటిస్తా - నాగేశ్వరరావు**
**-తీరు మారకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరిక**



**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 07** కందుకూరు నియోజకవర్గంలో కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ విభాగం పనితీరు సరిగాలేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య సిబ్బందిపై పర్యవేక్షణ కూడా సరిగా లేదన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి ఆకస్మికంగా వెళ్లిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు... కమిషనర్ అనూషతోపాటు శానిటేషన్ సూపర్వైజర్లు, మేస్త్రీలతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో పారిశుధ్యం సరిగాలేదంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొన్నిచోట్ల రోజుల తరబడి కాలువల్లో చెత్తను క్లియర్ చేయడం లేదని, మరికొన్నిచోట్ల తూతూమంత్రంగా పనిచేస్తుండడం వల్ల దుర్వాసన వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడెక్కడ అలాంటి పరిస్థితి ఉందో, వార్డుల వారీగా ఆయన వివరించారు. కమిషనర్ ఒక్కరే సక్రమంగా పనిచేస్తే సరిపోదని, సిబ్బంది మొత్తం బాధ్యతతో పనిచేసినప్పుడే శుభ్రమైన వాతావరణం ఏర్పడి ప్రజల హర్షిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా చెత్త పేరుకుపోయే బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు దుకాణదారులు, తోపుడుబండ్ల వ్యాపారులు రాత్రిపూట చెత్తను రోడ్లు, సైడ్ కాలవల్లో ఇష్టానుసారంగా వేస్తున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాంటివారికి పారిశుధ్యంపై ఎందుకు అవగాహన కల్పించడం లేదని కమిషనర్ ను ప్రశ్నించారు. వారందరికీ అవగాహన కల్పించాలని, అప్పటికి మార్పు రాకపోతే జరిమానాలు విధించాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే పారిశుధ్య సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే, వారిని వెంటనే తొలగించాలని కూడా ఎమ్మెల్యే ఆదేశించారు. మరో వారం రోజుల్లో మున్సిపాలిటీలో పరిస్థితి చక్కబడాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అధికారులతో అన్నారు. వారం తర్వాత ప్రతిరోజూ ఉదయాన్నే తాను కూడా స్వయంగా వార్డుల్లో పర్యటనకు వస్తానని చెప్పారు.

# జిల్లాలో ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి

**-ఆకస్మిక తనిఖీలతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను నేరుగా పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల**
**-క్షేత్రస్థాయిలో రైతులతో మట్లాడుతూ సమస్యల పరిష్కారం**
**-ఖరీఫ్, రబీ సీజన్లలో ఇప్పటిదాకా జిల్లాలో మొత్తం 1,04,245 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**
**-ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని అన్నదాతలకు కలెక్టర్ భరోసా**



**నెల్లూరు, (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 07** జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల క్షేత్రస్థాయిలో తన పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల పనితీరును స్వయంగా పరిశీలిస్తున్నారు. ఇటీవల టి.పి. గూడూరు మండలం వరిగొండతో పాటు విడవలూరు మండలం పార్లపల్లి ప్రాంతాల్లో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి ధాన్యం సేకరణ పరిస్థితులను సమీక్షించారు. ఈ ఆకస్మిక తనిఖీలతో అధికారులు అప్రమత్తమవుతుండగా, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెరుగుతోంది. తోటపల్లి గూడూరు మండలం వరిగొండలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడి రికార్డులు, నమోదు విధానం, ధాన్యం స్వీకరణ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందిని కొనుగోలు విధానం, రైతులకు అందుతున్న సదుపాయాలు, చెల్లింపుల వ్యవస్థపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డుపై నిలిపి ఉంచిన రైతుల ధాన్యంతో కూడిన ట్రాక్టర్లను పరిశీలించిన ఆయన, ట్రక్ షీట్, నమోదు విధానం, ట్రాకింగ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే విడవలూరు మండలం పార్లపల్లి వద్ద రోడ్డుపై ధాన్యాన్ని ఉంచిన రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. ధాన్యం సేకరణ వివరాలను తెలుసుకుని, రైతులకు ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లలో ఇప్పటిదాకా జిల్లాలో మొత్తం 1,04,245 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 6,603 మంది రైతుల వద్ద నుండి సేకరించారు. ఈ ధాన్యపు మొత్తం విలువ సుమారు రూ. 249 కోట్లు కాగా, అందులో 5,678 మంది రైతులకు రూ. 211 కోట్లు 24 గంటల లోపు చెల్లింపులు చేయడం జరిగింది. ధాన్యం నాణ్యతపై కూడా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం కొలిచే యంత్రాలను స్వయంగా పరిశీలిస్తూ, ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు జరుగుతున్నదా అన్నది నిర్ధారిస్తున్నారు. ధాన్యం సేకరణ, కొనుగోలు పై కలెక్టర్ ప్రతిరోజు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. రైతులు ఎక్కడా నష్టపోకుండా ఎప్పటికప్పుడు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ధాన్యం రవాణా, గోనె సంచుల సరఫరా, మిల్లులకు తరలింపు వంటి అంశాలపై కూడా కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. రైతుల ధాన్యం ఆలస్యం కాకుండా వేగంగా కొనుగోలు చేసి, చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ధాన్యం సేకరణను సమర్థవంతంగా నిర్వహించి రైతుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా కలెక్టర్ చర్యలు కొనసాగుతున్నాయి. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు ప్రభుత్వం భరోసాగా ఉంటుందని కలెక్టర్ అన్నదాతలకు అండగా నిలిచేలా ధాన్యం సేకరణ ప్రక్రియ పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

# ఆరోగ్యం మనిషి జీవితంలో అత్యంత విలువైన సంపద : ఎమ్మెల్యే కాకర్ల





**-ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్యంపై అవగాహన అవసరం**



**వింజమూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 7** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వింజమూరు మండల కేంద్రంలో డా॥ మాసలమని చిన్నపిల్లల హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ స్థాపించబడిన రోజును గుర్తుచేసుకుంటూ ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. ఆరోగ్యం అనేది ప్రతి మనిషికి అత్యంత విలువైన సంపద అని, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. వింజమూరు మండలంలో డాక్టర్ మాసలమని గారు ఎంతో నిబద్ధతతో వైద్య సేవలు అందిస్తూ ప్రజలలో ఆరోగ్య చైతన్యాన్ని పెంచుతున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాణ్యమైన వైద్య సేవలు అందుబాటు లోకి తీసుకువచ్చేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. వైద్య సేవలతో పాటు ప్రజల సమస్యలపై మరింతగా స్పందించేందుకు, సమాజానికి విస్తృతంగా సేవలు అందించేందుకు రాజకీయ రంగంలోకి అడుగుపెట్టాలని మాసలమని ని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోగులకు మరియు ప్రజలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం ప్రాముఖ్యతను వివరించి, ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, వైద్య సిబ్బంది, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విజయవాడను ట్రాఫిక్ రహిత నగరంగా తీర్చిదిద్దుతాం : మంత్రి నారాయణ ..!

**-త్వరలోనే విజయవాడ, తిరుపతిలకు 'గ్రేటర్' హోదా..!**
**-మూడు నియోజకవర్గాల రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి నారాయణ.**



**విజయవాడ విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 7** విజయవాడ నగరాభివృద్ధికి మరియు ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. బుధవారం విజయవాడ, పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల కు సంబంధించి మంత్రి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. విజయవాడ నగరాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రూ. 105 కోట్లతో నిర్మించనున్న మూడు కీలకమైన మాస్టర్ ప్లాన్ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని సనత్ నగర్‌లో రూ. 2.75 కోట్లతో నిర్మించిన నూతన రహదారిని మంత్రి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల అభివృద్ధి కోసం మంత్రి తక్షణమే రూ. 7 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. "విజయవాడ మరియు తిరుపతి నగరాలను గ్రేటర్ నగరాలుగా మారుస్తాం" అని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణన ప్రక్రియ పూర్తి కాగానే, దీనిపై అధికారికంగా నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. గ్రేటర్ హోదా ద్వారా ఈ నగరాలకు మరిన్ని నిధులు, మెరుగైన మౌలిక సదుపాయాలు కలుగుతాయని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల దుస్థితికి గత ప్రభుత్వమే కారణమని మంత్రి విమర్శించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి రూ. 29 వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. గత ప్రభుత్వం మున్సిపాలిటీల నిధులను దారి మళ్లించి, ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని మండిపడ్డారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడం వల్లే అనేక పనులు మధ్యలోనే నిలిచిపోయాయని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు తాగునీరు, డ్రెయిన్లు, ఇతర ప్రాథమిక మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందని, యుద్ధప్రతిపాదికన పెండింగ్ పనులను పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని చిన్ని, బాలశౌరి, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, యార్లగడ్డ వెంకట్రావు, బోడే ప్రసాద్ మరియు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# వింజమూరు, దుత్తలూరులో మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన..!

**-బస్టాండ్ సెంటర్లలో ప్రజల సౌకర్యాలపై ఎమ్మెల్యే దృష్టి..!**
**-మహిళలు, ప్రయాణికుల అవసరాలకు ప్రాధాన్యం..!**
**-త్వరలో ఆధునిక మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభం..!**



**వింజమూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 7** వింజమూరు మరియు దుత్తలూరు మండల కేంద్రాలలోని బస్టాండ్ సెంటర్ల వద్ద స్త్రీలు, ప్రయాణికులు మరియు స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ స్వయంగా పరిశీలించారు. ప్రజల సౌకర్యం, శుభ్రత, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలను ముఖ్యంగా పరిగణనలోకి తీసుకుంటూ ఈ కార్యక్రమం చేపట్టడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, బస్టాండ్ సెంటర్లలో రోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సదుపాయాలతో కూడిన మరుగుదొడ్ల నిర్మాణం అత్యవసరమని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పరిశుభ్రమైన వాతావరణంలో ఈ సదుపాయాలు అందుబాటులో ఉండేలా తగిన ప్రదేశాలను ఎంపిక చేస్తున్నామని పేర్కొన్నారు.

# "రాధాకృష్ణా.. ఖబర్దార్ – కాకాణి హెచ్చరిక"



**హైదరాబాద్ విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 7** మీడియా ముసుగులో వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబ సభ్యులను, మహిళలను కించపరిచే విధంగా అసభ్యకర రాతలు రాస్తున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ తీరుకు నిరసనగా హైదరాబాద్‌లోని ఏబీఎన్ కార్యాలయం ముందు బైఠాయించి, నిరసన తెలియజేశారు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి...... మంగళవారం హైదరాబాద్లోని ఏ బీ యన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు..... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల గౌరవానికి భంగం కలిగించేలా చెత్త రాతలు రాస్తున్న రాధాకృష్ణను, తప్పుడు కథనాలతో మనోభావాలు దెబ్బతీసినందుకు ఏబీఎన్ యాజమాన్యం, రాష్ట్ర మహిళా లోకానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి డిమాండ్ చేశారు....మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి లి?ఆంధ్రజ్యోతి తప్పుడు కథనాలపై ధ్వజమెత్తరు...

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.